# ఆరవ ప్రాణం

- మిర్రర్

'కాకిపిల్ల కాకికి ముద్దు' అన్నారే కానీ, 'కుక్క పిల్ల మనిషికి ముద్దు' అని ఎవరూ అనగా చలపతి వినలేదు.

కానీ చూశాడు.

ఒకసారి కాదు. గత సంవత్సరం నుంచీ చూస్తూనే ఉన్నాడు.

పక్క ఇంటి వైకుంఠం తను పెంచుతున్న కుక్క పిల్లని తన ఆరవ ప్రాణంగా చూసుకుంటాడు.

అది ఒకప్పుడు పిల్ల.

కాని ఇప్పుడు పెరిగి పెద్ద కుక్క అయింది.

వైకుంఠానికి తన కుక్క శక్తి సామర్థ్యాల మీద అపారమైన నమ్మకం ఉంది.

రాత్రి పూట అది మెలకువగా ఉండి ఎలా తన ఇంటిని కాపాడుతున్నదీ, కొత్తముఖం కనపడగానే వారు లోపలికి రాకుండా ఎలా ప్రతిఘటించేదీ, ఇంకా ఇలాగే దాని గుణ గుణాలు కీర్తిస్తూ, వచ్చిన వాళ్ళకు విసుగు వచ్చేలా చేస్తుంటాడు.

అంతవరకే అయితే అసలు కథే లేకపోను. కానీ అంతకంటే పెద్ద సమస్య ఒకటి వచ్చి పడింది చలపతికి.

వైకుంఠం ఆ కుక్క పిల్లని తెచ్చిన కొత్తలో దాని మెడకి ఒక తాడు కట్టి ఇంటిముందు జామ చెట్టుకి కట్టి ఉంచేవాడు. అలా ఇరవై నాలుగు గంటలు కట్టి పడేసి ఉంచటంతో దానికి చిరాకు పుట్టి అస్తమానం కుయ్ కుయ్ మని అరుస్తూ ఉండేది.

కుక్క క్రమంగా పెరిగి పెద్దదైంది. కాని, అరుపులు మాత్రం మానలేదు. కాగా అప్పుడు 'కుయ్ కుయ్' అని అరిచేది — ఇప్పుడు ఇంత గొంతు పెట్టుకుని ''భౌవ్ భౌవ్'' మని మొరుగుతోంది.

ఆది అలా నిర్విరామంగా పగలు, రాత్రి అరుస్తూంటే చలపతికి మహా చిరాకు పుడుతుండటమే కాక అసలు మనసు ఎప్పుడూ ఆ కుక్కమీదే లగ్నం అయి, మరేమీ ఆలోచించలేక పోతున్నాడు.

ఆ కుక్క మీద ఎంత కోపం ఉన్నా, చలపతి దాన్ని ఏమీ చేయలేక పోయాడు. అందుకు కారణం దానికీ, తనకీ యజమాని ఒక్కడు కావడమే.

వైకుంఠం చలపతికి పై ఆఫీసరు.


ఆఫీసులో ఆయన్ని భరిస్తున్నట్టుగానే, ఇంటి వద్ద ఆయన కుక్కని కూడా భరిస్తూ వస్తున్నాడు చలపతి.

అదే ఇంకొకరి కుక్క అయితే తను ఈపాటికి న్యూసెన్సు కేసు పెట్టి ఉండేవాడు.

అసలు తను ఇక్కడ ఇల్లు కట్టుకునేప్పుడు ఇలాంటి ప్రాబ్లెం వస్తుందని ఊహించ లేక పోయాడు.

తన ఆఫీసు వాళ్ళు కో— ఆపరేటివ్ బేసిస్ మీద స్థలం సేకరించి, హౌసింగ్ సొసైటీ పెట్టారు. అందులో తను కూడా మెంబరు. తనకీ, వైకుంఠం గారికీ పక్క పక్క ప్లాట్లు వచ్చాయి.

ఒకనాడు తను వైకుంఠం గారితో కుక్క మరీ అరుస్తున్నట్టు, తనకి నిద్రా భంగం అవుతున్నట్టు చూచాయగా చెప్పి చూశాడు. అయితే, అదో ముఖ్యమైన విషయం కాదన్నట్టుగా నిర్లక్ష్యంగా ఒక చిరునవ్వు నవ్వి, కుక్కని నిమురుతూ



''చూడు, టైగర్! అలా నువ్వు పెద్దగా అరవ కూడదు'' అంటూ మానవ భాషలో దానికి నీతి బోధ చేస్తుంటే చలపతికి వళ్ళు మండిపోయింది.

ఇలా కాదు. దీనికి ఏదైనా పథకం వెయ్యాలని నిర్ణయించుకున్నాడు.

ఆ తరవాత కొన్నాళ్ళు సెంట్రల్ లైబ్రరీకి వెళ్ళి కుక్కలు గురించి వ్రాసిన పుస్తకాలు చదివి, అవి శాకాహారం కంటె మాంసాహారాన్ని ఎక్కువ ఇష్టపడతాయి అని తెలుసుకున్నాడు.

అంతే!

ఆ మరునాటి నుంచి తన పథకం అమలు చేయటం మొదలుపెట్టాడు.

సరిగ్గా అర్ధరాత్రి సమయంలో కుక్కని మచ్చిక చేసుకుని మాంసం తినిపించటం మొదలు పెట్టాడు చలపతి.

వైకుంఠం శుద్ధ శాకాహారి. ఎంతసేపూ కుక్కకి అన్నం, పప్పు, బిస్కట్లు పెట్టేవాడు. దానికి జిహ్వ చచ్చి ఉందేమో చలపతి పెట్టిన మాంసం ముక్కలు మహా ఇంటరెస్టుగా తినేది.

అలా వారంరోజులు వరుసగా కుక్కకి మాంసం తినిపించి, తరవాత సడెన్‌గా మానేశాడు.

మాంసం తినటం అలవాటు పడిన ఆ కుక్కకి వైకుంఠం పెట్టే అన్నం, బిస్కట్లు రుచించేవి కాదు. రుచించటం లేదని ఊరుకోక, అది వైకుంఠం గారి అవతలి ఇంటి వాళ్ళు పెంచుకున్న కోడిని కాస్తా భోంచేసింది.

ఆ ఇంటి మనిషి కొంచెం ఘటికుడే!

''కోడి ఖరీదు ఇస్తావా, చస్తావా'' అంటూ వచ్చి వైకుంఠం గొంతు మీద కూర్చున్నాడు ఆ పెద్ద మనిషి.

వైకుంఠం మాత్రం తన కుక్క శుద్ధ శాకాహారి అని, అది మాంసం తినదని వాదించి కోడి ఖరీదు ఇవ్వను పొమ్మన్నాడు.

అవతల మనిషికి ఒళ్ళు మండిపోయింది.

తన కోడి బ్రతికి ఉంటే ఎన్ని గుడ్లు పెట్టేదో, ఆ గుడ్లు అన్నీ పొదిగి తిరిగి ఎన్ని కోళ్ళు అయ్యేవో... పెద్ద లెక్క తయారు చేసి అంత మొత్తాన్ని నష్ట పరిహారంగా ఇప్పించమని కోర్టులో వైకుంఠం మీద కేసు పెట్టాడు.

గెలిచాడు కూడాను!

దానితో వైకుంఠం గారికి కుక్క మీద ప్రేమ తగ్గిపోవటమే కాక, తనని కోర్టుకి లాగించినందుకు దాని మీద అసహ్యం కలగ సాగింది.

''ఎంత ప్రేమగా చూసుకున్నా వెధవది కుక్క బుద్ధి పోనిచ్చుకుంది కాదోయ్! అందుకే మ్యునిసిపాలిటీ వారి బండి వస్తే దాన్ని పంపించేశాను'' అని వైకుంఠం ఎవరితోనో అంటుంటే, చలపతి తనలో తానే నవ్వుకున్నాడు. ★